క్లుప్తంగా

చిన్నారులకు టీకాలు తప్పనిసరి: డీఐఓ



టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఐఓ ఎం.నారాయణ

పార్వతీపురంటౌన్: చిన్నారులకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఎం.నారాయణ అన్నారు. మండలంలోని అడ్డాపుశీల గ్రామంలో శనివారం పలువురు చిన్నారులకు ఆరోగ్య సిబ్బంది టీకాలు వేశారు. వ్యాక్సినేషన్‌ను పరిశీలించిన డీఐఓ ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. టీకా కార్డులో నమోదు చేసిన తేదీలను పరిశీలించారు. నిర్ణీత గడువు తేదీలోగా పిల్లలకు టీకాలు వేసేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు.

విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న రైతు సంఘం నాయకులు

సీతానగరం: కేరళ వరద బాధితులకు ఆర్థిక సహాయం కోసం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో విరాళాలు సేకరిస్తున్నారు. మండలంలోని కాశీపేటలో శనివారం సంఘం నాయకులు విరాళాలు సేకరించారు. సేకరించిన విరాళాలను కేరళ రాష్ట్ర ప్రభుత్వానికి అందించడం జరుగుతుందని తెలిపారు.

కోరం లేక ఎన్నిక వాయిదా

సీతానగరం: మండలంలోని అంటిపేట, కొత్తవలస ప్రాథమిక పాఠశాలలతో పాటు నిడగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం జరగాల్సిన ఎస్‌ఎంసీ ఎన్నికలను కోరం లేకపోవడంతో వాయిదా వేసినట్లు ఎంఈఓ తెలిపారు. అంటిపేటలో 1,2,4,5 తరగతులకు, కొత్తవలస 1,2,5 తరగతులకు, నిగడల్లులో 7వ తరగతికి సంబంధించి ఎస్‌ఎంసీ ఎన్నికలు వాయిదా పడినట్లు చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఎన్నికలు ఎప్పుడు నిర్వహించేది తెలియజేస్తామన్నారు.

ఫిట్‌నెస్ లేని వాహనాలపై కొరడా..



స్కూల్ బస్సు ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ను పరిశీలిస్తున్న ఏఎంవీఐలు

పార్వతీపురంటౌన్: స్కూల్ బస్సులకు ఫిట్నెస్ సర్టిఫికెట్ తప్పనిసరి అని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు సత్యనారాయణ, వరప్రసాద్ అన్నారు. పట్టణంలోని బెలగాం కూడలి వద్ద శనివారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులను పాఠశాలలకు తరలించే బస్సులు, ఆటోలు, మ్యాక్సీ క్యాబ్‌లలో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించరాదని సూచించారు. వాహనాలు మంచి కండిషన్‌లో ఉన్నాయో లేదో ఎప్పటికప్పుడు చెక్ చేయించుకోవాలన్నారు. ఫిట్‌నెస్ లేని వాహనాలను గుర్తించి సంబంధిత యజమానులపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిబంధనలు అతిక్రమించేవారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

విద్యార్థులు స్నేహపూర్వకంగా మెలగాలి



మాట్లాడుతున్న రెండవ అదనపు జిల్లా జడ్జి దామోధరరావు

గరుగుబిల్లి: విద్యార్థులు స్నేహపూర్వకంగా మెలగాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్, రెండవ అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు అన్నారు. మండలంలోని ఉల్లిభద్ర సమీపంలో ఉన్న డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన కళాశాలలో శనివారం 'యాంటీ ర్యాగింగ్'పై నిర్వహించిన సదస్సులో పాల్గొన్న ఆయన పలు చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. యువత చేతిలో దేశ భవిష్యత్తు ఉందన్నారు. విద్యార్థి స్థాయి నుంచే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. జూనియర్, సీనియర్ విద్యార్థులు స్నేహపూర్వకంగా మెలగాలని, ర్యాగింగ్ వంటి అసాంఘిక కృత్యాలు నిర్వహించి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. సమయపాలన పాటించడంతో పాటు మహిళల పట్ల, చట్టాల పట్ల గౌరవం కలిగి ఉండాలన్నారు. సీనియర్ న్యాయవాది తిమిటి జోగారావు మాట్లాడుతూ కళాశాల విద్యార్థులు నిబంధనలు అతిక్రమించి వ్యవహరించకూడదన్నారు. జీవిత లక్ష్యాలను సాధించేందుకు చదవడం ఒక్కటే మార్గమన్నారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డా.బి.ప్రసన్న కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.హరి రామ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

- కోల్‌కతా ఘటనపై హోరెత్తిన ఆందోళనలు
- ఐఎంఏ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన
- వైద్యులకు రక్షణ కల్పించాలని డిమాండ్



పార్వతీపురం టౌన్: జిల్లా ఆస్పత్రి వద్ద నల్ల బ్యాడ్జీలతో వైద్యులు, సిబ్బంది నిరసన



ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వద్ద మానవహారంగా ఏర్పడి నినాదాలు చేస్తున్న వైద్యులు

పార్వతీపురంటౌన్: కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని స్థానిక వైద్యులు, సిబ్బంది డిమాండ్ చేశారు. ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడిన వైద్యులకే రక్షణ లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు శనివారం నిరసన ర్యాలీలు చేపట్టారు. జిల్లా కేంద్రంలోని ఆస్పత్రి వద్ద నల్ల బ్యాడ్జీలతో ఆందోళన చేపట్టారు. అనంతరం అక్కడ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వరకు ర్యాలీగా చేరుకుని మానవహారం ఏర్పాటు చేశారు. కోల్‌కతాలోని ఘటనలో బాధ్యులను కఠినంగా శిక్షించాలని, బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని, వైద్యులు, వైద్య విద్యార్థుల రక్షణకు పటిష్టమైన చట్టం తీసుకు రావాలని డిమాండ్ చేశారు. అనంతరం బాధితురాలి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ కొవ్వొత్తులు వెలిగించి సంతాపం తెలియజేశారు. బలిజిపేట మండలంలో బలిజిపేట, అరసాడ పీహెచ్‌సీల పరిధిలో వైద్యులు, ఆరోగ్య సిబ్బంది నిరసన ర్యాలీలు చేపట్టారు. బలిజిపేట పీహెచ్‌సీ నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. సీతానగరం మండలంలో సీతానగరం, పెదంకలాం పీహెచ్‌సీ పరిధిలో వైద్యులు, సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. పీహెచ్‌సీ నుంచి బస్టాండ్ కూడలి వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. నిరసన ర్యాలీలో వందలాది మంది వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పటిష్ట చట్టాలు అవసరం

వైద్యురాలిని అత్యాచారం చేసి, హత్యం చేయడం చాలా దుర్మార్గం. మహిళలపై ఇటువంటి అఘాయిత్యాలు తరచూ జరుగుతున్నా ప్రభుత్వాలు పటిష్ట భద్రతా చర్యలు తీసుకోకపోవడం శోచనీయం. ఇప్పటికైనా వైద్యులు, వైద్య విద్యార్థినుల రక్షణకు చర్యలు తీసుకోవడంతో పాటు ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు నిందితులను కఠినంగా శిక్షించాలి.

– డాక్టర్ యాళ్ల వివేక్, ఐఎంఏ పార్వతీపురం జిల్లా అధ్యక్షుడు



సీతానగరం: నిరసన తెలియజేస్తున్న వైద్యులు, సిబ్బంది



బలిజిపేట: బలిజిపేటలో మానవహారంగా ఏర్పడిన వైద్య ఆరోగ్య సిబ్బంది

వైద్యురాలి హత్య దుర్మార్గం

ప్రాణాపాయంలో ఉన్న రోగులకు వైద్య సేవలందించి పునర్జన్మను ప్రసాదించే వైద్యులపై ఇటువంటి దాడులు చేయడం దుర్మార్గం. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు అయినా ఇంకా ప్రజలకు సేవలందించే వైద్యులకు రక్షణ కరువైందని చెప్పేందుకు కోల్‌కతాలోని ఆర్జీ కర్ వైద్య కళాశాలలో జరిగిన ఘటనే నిదర్శనం. దేశంలో వైద్యులు, వైద్య విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది రక్షణకు ప్రభుత్వాలు పటిష్ట చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఉంది. కోల్‌కతా ఘటనలో బాధ్యులను కఠినంగా శిక్షించాలి.

– డాక్టర్ బి.వాగ్దేవి, సూపరింటెండెంట్, జిల్లా ఆస్పత్రి

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం



గిరిజన మహిళలకు పొదుపు ఆవశ్యకతను వివరిస్తున్న అధికారులు

సాలూరు రూరల్: గిరిజనులు పొదుపు చేయడానికి ప్రాధాన్యత ఇవ్వాలని జాతీయ గిరిజన ఆర్థిక సంస్థ రీజనల్ అధికారి కృష్ణవేణి పిలుపునిచ్చారు. భారత్ వికషిత్ సంకల్ప్ కార్యక్రమంలో భాగంగా శనివారం నేరెళ్లవలస గ్రామంలో మామిడిపల్లి ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంక్ ఆధ్వర్యంలో గిరిజనుల ఆర్థికాభివృద్ధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్థిక నిర్వాహణపై అవగాహన కలిగిఉండాలని సూచించారు. దీనిపై సరైన అవగాహన లేకపోవడం వల్ల గిరిజనులు ఆర్థికంగా వెనుకబాటు తనాన్ని అనుభవిస్తున్నారన్నారు. సంపాదించిన దానిలో కొంత భాగం బ్యాంకుల్లో పొదుపుచేయాలని సూచించారు. అలాగే పొదుపు సంఘాల లీడర్లు పొదుపు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలపై సంఘంలోని సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ మేనేజర్ సునీల్ వర్మ, రీజనల్ ఆఫీసర్ కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

బోధనలో నూతన పద్ధతులు అనుసరించాలి



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఎంఈఓ-1 సామల సింహాచలం

బలిజిపేట: స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో నేర్చుకున్న అంశాలను బోధనలో అన్వయించుకుని వినూత్న పద్ధతులతో విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధించాలని ఎంఈఓ-1 సామల సింహాచలం అన్నారు. అరసాడ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న స్కూల్ కాంప్లెక్స్‌ను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. నూతన విద్యావిధానాలను అవగాహన చేసుకునేందుకే స్కూల్ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఇది ఎంతో దోహదపడుతుందన్నారు. ఉపాధ్యాయులు తరగతి గదిలో టీఎల్‌ఎంను వినియోగించి బోధన చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సీహెచ్ రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి డిమాండ్



రిలే నిరాహార దీక్షల్లో పాల్గొన్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

పార్వతీపురంటౌన్: జిల్లాలో భూ సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. శివ్వాం దళితుల భూ సమస్య పరిష్కరించాలని కోరుడూ చేపట్టిన రిలే నిరాహార దీక్షకు శనివారం జియ్యమ్మవలస మండలానికి చెందిన పలువురు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా గంగునాయుడు మాట్లాడుతూ.. రెవెన్యూ అధికారులు కావాలనే శివ్వాం దళితుల సమస్య పరిష్కరించకుండా తాత్సారం చేస్తున్నారని ఆరోపించారు. ఆ భూమిపై అన్ని హక్కులు దళితులకు ఉన్నప్పటికీ కోర్టు కేసు పేరుతో అధికారులు తప్పించుకు తిరుగుతున్నారని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్యాక్రాంతమైన భూములన్నీ పేదలకు అప్పచెబుతామని చెప్తుందని, కానీ క్షేత్రస్థాయిలో అలా జరగడం లేదన్నారు. జిల్లాలో దళితులు, గిరిజనులు, పేదల భూములు అనేకం అన్యాక్రాంతం అయ్యాయన్నారు. పట్టాలిచ్చి భూములు చూపించలేదని, భూమి సాగు చేస్తున్న వారికి పట్టాలు ఇవ్వలేదని, 10 ఎకరాల వరకు సాగు చేస్తున్న గిరిజనులకు పోడు పట్టాలు ఇవ్వలేదలన్నారు. భూ సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 19న నిర్వహించే చలో కలెక్టరేట్ కార్యక్రమానికి పేదలంతా కదలి రావాలని పిలుపునిచ్చారు. దీక్షలో గిరిజన సంఘం నాయకులు కోరంగి సీతారాం, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గరుగుబిల్లి శ్రీనివాసరావు, దాలి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన బోధన అందించాలి

- డిప్యూటీ డీఈఓ కృష్ణమూర్తి

పాలకొండ రూరల్: ఉత్తమ ఫలితాల సాధన దిశగా ఉపాధ్యాయులు విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలని డిప్యూటీ డీఈఓ పి.కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని ఎం.సింగుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలలల్లో విద్యా ప్రమాణాలు, ఉపాధ్యాయుల సంఖ్య, మౌలిక వసతులు, తదితర అంశాలపై ఆరా తీశారు. పదో తరగతి పరీక్షలను దృష్టిలో పెట్టుకుని విద్యార్థులను గ్రేడ్లుగా విభజించి బోధన అందించాలన్నారు. సమావేశంలో హెచ్‌ఎం బి.సంఘంనాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువ ఐఏఎస్‌లను ఐటీడీఏ పీఓలుగా నియమించాలి



మాట్లాడుతున్న గిరిజన సంక్షేమ సంఘం నాయకులు

పార్వతీపురంటౌన్: యువ ఐఏఎస్‌లను సీతంపేట, పార్వతీపురం ఐటీడీఏలకు పీఓలుగా నియమించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాడంగి సాయిబాబు, పాలక రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఐటీడీఏ కార్యాలయం వద్ద శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. పదిహేను రోజుల కిందట పీఓలను ఆకస్మికంగా బదిలీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం పది రోజులు అవుతున్న రెగ్యులర్ పీఓలను నియమించక పోవడం ఏమిటని ప్రశ్నించారు. తక్షణమే యువ ఐఏఎస్‌లను ఐటీడీఏ పీఓలుగా నియమించాలని డిమాండ్ చేశారు. ఐటీడీఏలకు రెగ్యులర్ పీఓలు లేకుండా గిరిజన సంక్షేమం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. ఐటీడీఏ పాలకవర్గ సమావేశాలు ఏర్పాటు చేసి గిరిజన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. వాగులో కొట్టుకుపోయి మృతి చెందిన కొటికిపెంట ఏకలవ్య పాఠశాల ఉపాధ్యాయురాలు ఆర్తి మృతికి ఈ సందర్భంగా సంతాపం తెలియజేశారు. అన్ని వసతులతో ఏకలవ్య పాఠశాల భవనాల నిర్మాణాలు పూర్తి చేయాలని కోరారు.

బడిబయట పిల్లలను గుర్తించాలి: ఎంఈఓ



సూచనలు చేస్తున్న ఎంఈఓ నాగభూషణరావు

గరుగుబిల్లి: చదువు మధ్యలో ఆపివేసిన బడి బయట ఉన్న పిల్లలను గుర్తించాలని ఎంఈఓ ఎస్.నాగభూషణరావు అన్నారు. స్థానిక ఎంఆర్సీలో గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లతో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల పిల్లలకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన వసతులు కల్పిస్తోందన్నారు. ఏ పాఠశాలలోనూ చేరకుండా ఉన్న పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 కె.కొండలరావు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

- గిరిజన శాఖామంత్రి గుమ్మడి సంధ్యారాణి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

మక్కువ: ప్రజాసమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఎం.పారమ్మ అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి మంత్రి సంధ్యారాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ ప్రభుత్వ శాఖల పనితీరుపై ఆయా శాఖల అధికారులతో చర్చించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రజా ప్రతినిధులు తెలియజేసిన ప్రతి సమస్యకు అధికారులు జవాబు ఇవ్వాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. త్వరలో సర్పంచుల ఖాతాలోకి నగదు జమ చేయనున్నామన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో మండలాభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. మండలంలో గిరిజన ప్రాంతమైన దుగ్గేరు గ్రామంలో పీహెచ్‌సీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామని మంత్రి తెలిపారు. అలాగే వెంగళరాయ సాగర్ ప్రాజెక్టు ఆధునీకరణ పనులు పూర్తిచేసి ఆయకట్టు శివారు గ్రామాలకు సాగునీరు అందిస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని సూచించారు. సమావేశంలో జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు, ఎంపీడీఓ సిహెచ్.సూర్యనారాయణ, తహసీల్దార్ షేక్ ఇబ్రహీం, సీడీపీఓ అనంతకుమారి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ముంపు సమస్య పరిష్కారానికి చర్యలు



వరహాల గెడ్డలో పూడికతీత పనులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి

పార్వతీపురంటౌన్: ముంపు సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టామని మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అన్నారు. పట్టణంలోని మెయిన్ రోడ్డులో ఉన్న వరహాల గెడ్డలో చేపడుతున్న పూడికతీత పనులను శనివారం పర్యవేక్షించారు. అనంతరం ఎంఆర్‌ఎఫ్ సెంటర్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా పట్టణ శివారు ప్రాంతాల్లో మురుగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కమిషనర్ శ్రీనివాస్‌కు సూచించారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ జయంతి, డీఈ కిరణ్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మురళి, టౌన్ ప్లానింగ్ సెక్రటరీలు పాల్, నీరజ, శానిటేషన్ సెక్రటరీలు అచ్యుత్, వెంకటరావు, స్వరూప్, మేస్త్రీలు సాయి, రవి పాల్గొన్నారు.

బాల్య వివాహాలు వద్దు.. చదువే ముద్దు



మాట్లాడుతున్న జిల్లా బాలల సంరక్షణ అధికారి అల్లు సత్యనారాయణ

పార్వతీపురంటౌన్: బాల్యవివాహాలు వద్దు.. చదువే ముద్దు అని జిల్లా బాలల సంరక్షణ అధికారి అల్లు సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాలపై శనివారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్య వివాహాల నిరోధకం చట్టం 2006 ప్రకారం అమ్మాయి వయస్సు 18 సంవత్సరాలు, అబ్బాయి వయస్సు 21 సంవత్సరాలు లోపు పెళ్లి చేస్తే చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహాలు నిర్వహించినా, వాటిని ప్రోత్సహించినా లక్ష రూపాయల జరీమానా, రెండు సంవత్సరాల జైలు శిక్ష తప్పదని స్పష్టం చేశారు. బాల్య వివాహాల వల్ల కలిగే ఆరోగ్య, ఆర్థిక, సామాజిక అనర్థాలను వివరించారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగినట్లయితే ఆ గ్రామంలోని సచివాలయంలో లేదా చైల్డ్‌లైన్ టోల్‌ఫ్రీ నంబర్ 1098కు సమాచారం అందించాలని కోరారు. చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎస్.ప్రసాదరావు కౌమార దశలో బాలలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, గుడ్ టచ్–బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఓఆర్‌డబ్ల్యూ ఆర్.హరికృష్ణ, పాఠశాల హెచ్‌ఎం ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను పరిరక్షించుకుందాం..

- ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ

పార్వతీపురంటౌన్: శ్రమికులను సంఘటితం చేసి కార్మిక చట్టాలను పరిరక్షించుకుందామని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ పిలుపునిచ్చారు. స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఆర్‌వీఎస్ కుమార్ అధ్యక్షతన జిల్లా జనరల్ బాడీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. సమావేశానికి ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా నిర్మాణ బాధ్యులు పడాల రమణ, ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు ఉమ్మడి జిల్లాల ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి రమణ మాట్లాడుతూ.. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రైల్వేలు, విమానాశ్రయాలు, పోర్టులు, బొగ్గు గనులను కారు చౌకగా కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేస్తోందని విమర్శించారు. కార్మికుల పోరాడి సాధించుకున్న చట్టాలకు తూట్లు పొడిచి, లేబర్ కోడ్ పేరుతో కార్మికుల హక్కులను కాలరాసేందుకు ప్రయత్నిస్తోందని మండిపడ్డారు.

ఎన్‌డీఏ ప్రభుత్వం కార్మికుల పట్ల అవలంబిస్తున్న విధానాలపై చర్చించేందుకు విశాఖపట్నంలో సెప్టెంబర్ 1,2,3, తేదీల్లో ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సమావేశాల్లో కార్మిక సమస్యలపై చర్చించి, భవిష్యత్ కార్యాచరణ రూపొందించడం జరుగుతుందన్నారు.ఈ సమావేశాలకు జిల్లాలోని కార్మికులంతా తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యులు ఈవీ నాయుడు, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు సింహాద్రి దుర్గారావు, అలజంగి కుమారమ్మ, మజ్జి చంద్రమౌళి, ఆర్.దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.